శ్రీ

# భాగవతకథాసుధ

(రెండవభాగము)

రచన

డా॥ కావూరి పాపయ్యశాస్త్రి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2018

# BHAGAVATHA KATHA SUDHA
**(2nd Part)**

*By*
**Dr. Kavuri Papaiah Sastry**

T.T.D. Religious Publications Series No. 1277
© All Rights Reserved

*First Print : 2018*

*Copies :* 500

*Published by :*
**Sri ANIL KUMAR SINGHAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati.

## ముందుమాట

పరమార్థ ప్రదాయిని అయిన భాగవతాన్ని రచయితలు వివిధ సాహిత్య రూపాలతో పాఠకులకు, శ్రోతలకు, ప్రేక్షకులకు అందిస్తున్నారు. అవి పద్య గద్య గేయాలుగానే కాక హరికథలుగా, నాటకాలుగా, వివిధ కళారూపాలుగా వస్తున్నాయి. చక్కెరతో ఏ వంట వండినా రుచి తీపిగా ఉన్నట్లే భాగవత జిజ్ఞాసువులు తమకు నచ్చిన సాహిత్య ప్రక్రియల నాశ్రయించి భాగవత మకరందాన్ని ఆస్వాదిస్తున్నారు.

కొందరికి పద్యమిష్టం, మరికొందరికి గద్యమిష్టం, ఇంకొందరికి గేయమిష్టం. ఇప్పుడు మన ముందున్న భాగవతకథాసుధ – గేయ ఛందస్సులో తయారయింది. 'పాఠ్యే గేయేచ మధురమ్' అన్నారు. గాన యోగ్యమయింది గేయం. గేయ ఛందస్సులో మాత్రలు నడకను నిబంధిస్తాయి. గేయం తాళాత్మకంగా సాగుతుంది. తేలిక పదాలతో రచన సాగితే పాఠకులు శ్రావ్యంగా వింటారు, చదువు కొంటారు. ఈ భాగవత కథా సుధలోని ఛందస్సు మూడు మాత్రలతో త్ర్యస్రంలో సాగింది. రచన సరళసుందరం. రచయిత కావూరి పాపయ్య శాస్త్రి గారి భాగవతకథాసుధ – మొదటి భాగం ఇది వరకే వచ్చింది. ఇది రెండో భాగం. ఇందులో పన్నెండు కథలున్నాయి. మత్స్యావతారంతో మొదలై – పరీక్షిత్తు కథతో ముగుస్తుంది. అక్షర పరిజ్ఞాన మున్న సాధారణ పాఠకులు అవగాహన చేసుకొంటూ భాగవత పరమార్థాన్ని – అనుభవించగలరు. సరళంగానేకాక యోగ్యంగాను సాగిన ఈ భాగవత కథాసుధ లోని పన్నెండు కథలు బాలబాలికలకు చక్కగా ఉపకరిస్తాయి.

తెలుగు భాష పైన ఆసక్తిని కలిగిస్తాయి. భాగవతకథలమీద మక్కువను పెంచుతాయి.

ఈ రచనను తి.తి.దే. ప్రచురణకు స్వీకరించి పాఠకులకు అందిస్తున్నది. ఎప్పటివలెనే ఈ పుస్తకాన్ని పాఠకులు సమాదరించగలరని ఆకాంక్షిస్తున్నాము.

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| **కథ** | **పుట** |
|---|---|
| 1. మత్స్యావతార కథ | 1 |
| 2. అజామిళుని కథ | 8 |
| 3. ధ్రువుని కథ | 13 |
| 4. రంతి దేవుని కథ | 20 |
| 5. బాణాసుర కథ | 24 |
| 6. స్యమంతకమణి కథ | 33 |
| 7. యయాతి కథ | 40 |
| 8. దక్ష ప్రజాపతి కథ | 48 |
| 9. పరశురాముని కథ | 55 |
| 10. పృథుచక్రవర్తి కథ | 62 |
| 11. సుభద్రా కళ్యాణము | 66 |
| 12. పరీక్షిత్తు కథ | 70 |

# మత్స్యావతార కథ

మత్స్యమూర్తిగా శ్రీహరి
కుత్సిత దానవుని ద్రుంచి
వేధకు వేదాలొసగిన
గాథ తెలుపుమా మునివర!

వినయమెసగ పరీక్షిత్తు
మునివరు శుకయోగి నడుగ
శ్రీహరి యవతార గాథ
శ్రీ శుకముని చెప్పె నిట్లు!

వేదములను, సురుల గావ
విప్రసాధు రక్షార్థము
హరిధరించె అవతారము
లందు తొలుత మీనమయ్యె!

మునుపటి కల్పాంతవేళ
ఘనుడు ద్రవిళ దేశరాజు
సత్యవ్రతుడు నిష్ఠతోడ
సత్తపమ్ము గావించెను!

సత్యవ్రతుడు నియమయుతుడు
జలములు మాత్రమె గ్రోలుచు
నొక్క ఏటి తటమునందు
చక్కగ తపమొనరించెను!

"కృతమాలా" తటమునందు
అతులితముగ తపమొనర్చి
జలజాక్షుడు హరి కొసగగ
జలతర్పణ మొనరించెను!

అత్తరి రాజుకు దోసిట
నచ్చెరువుగ మీను పిల్ల
వచ్చిన రాజులికి పడుచు
వదలె దాని జలములందు!

అంతట నా మీనము భూ
కాంతునితో పలికె నిట్లు
రాజా! యీ యేటి యందు
రక్షణమ్ము కరవయ్యెను!

పసి ఝషముల ముమ్ముబట్టి
పాపజాతి చంపు చుండె
కావున కాపాడుము నను
కరుణ గలిగి దయానిధీ!

వలలు పూని జాలరులు
వత్తురు వేటాడుదురు
కావున కాపాడుము నను
కారుణ్యముతో రాజా!

అని ఝషశాబకము పలుక
అనుకంపానిధి భూపతి
కమండలమునందు పట్టి
చేపశిశువు గొంపోయెను!

ఆ రాతిరి రాజు యింట
నా ఝషశాబకము పెరిగి
ఆ కమండలమున నిండి
అవనిపతికి నిట్లనియెను!



ఇలాపతీ! ఈ పాత్రము
ఇరుకుగ నున్నది నాకును
వేరొక పాత్రమున నుంచి
వేగనన్ను కాపాడుము!

అని ఝషమన భూవరుండు
కనికరమున దానిని గని
సలిలకలశమందు నునిచి
సంరక్షించెను దానిని!

ముహూర్తమున నా ఝషమ్ము
మూడింతలు పెరిగి పెరిగి
వేరొక పాత్రను దెమ్మని
వేడుకొనెను భూకాంతుని

ధరణి పాలు డంత మిగుల
కరుణాళువు అగుట వలన
పెరిగి నట్టి ఆ చేపను
చిరుతమడుగునకు మార్చెను!

మగుడ చేప పెరిగి పెరిగి
మడుగు నిండ నిండి పోవ
జనవిభుడా చేపను పెను
జలాశయమ్మున విడిచెను!

జలాశయమ్మున నిండిన
జలచరమును గని భూపతి
మహామహుడు దయాళుడై
మహార్ణవమ్మున విడిచెను!

అంతట నా మహామత్స్య
మవనిపతిని గాంచి పలికె
రాజా! మకరాలయమున
రాక్షస మీనము లున్నవి!

కాపాడితి వింత దనుక
కరుణ గలిగి విడువకు మిక
ఆ మాటలు విన్న రాజు
అనియె నిట్లు మీనముతో!

ఒక్క రోజు నందె నీవు
చక్కగ శత యోజనములు
విస్మయమున వేగమ్ముగ
విస్తరించితివి చూడగ!

ఎన్నడు కనివిని యెరుగము
ఈ రకమగు మీనమ్ముల
ఆపన్నుల కాపాడగ
నంభశ్చరరూపమ్మున
అవతరించినట్టి హరివి
అవ్యయ! శ్రీనారాయణ!
నీ లీల లమోఘమ్ములు
నిఖిల లోక శరణ్యా!
దీనుల మము కాపాడుము
దేవదేవ! దయామయా!

శ్రీ మహిళా కుచసీమల
క్రీడించెడు పరమపురుష
మహామీన మగుచు నీవు
మహి నవతరించితి వేల!



అని పలుకగ నా మీనము
ననియె నిట్లు రాజు తోడ
రాజా! ఏడవ దినమున
రానున్నది ప్రళయమెకటి!

ముజ్జగములు నీట మునుగు
ముసురు పట్టి వాన కురియు
ప్రళయజలమ్ముల యందున
వచ్చునొక్క పెద్దనావ
ఓషధులును బీజతతులు
ఉండును ఆ నావ లోన!
సత్తపముల నిధులు నైన
సప్తర్షులు నావ నుండు
సత్యవ్రత! వారి గూడి
సంచరించు విలయజలధి!

ముందేమియు గానరాని
అంధకార మలము కొనును
కడలి అలల పైన నావ
కదలుచుండు మును ముందుకు!

అంభోనిధి యందు నావ
అటు నిటు కదలక యుండగ
అలలతాకు సోకనీక
నావను రక్షించు చుందు!

తెల్లవారు వరకు నావ
తిరుగును ఆ కడలి లోన
జలధి యందు నావ గావ
జలచరరూపము దాల్చితి

మరియు ప్రయోజనము గలదు
మహామతీ! తెలియ గలవు!

మాధవుపదములు దలచుచు
మహారాజు నిదురించెను!
కల్పాంతంబయ్యెనపుడు
కారుచీకటులు కమ్మెను

జలధు లేదు నుప్పొంగెను
చెలియలికట్టలు దాటెను
ప్రళయకాలజలాలలో
కలసి పోయె ముజ్జగములు

బ్రహ్మ సృష్టి చేసి చేసి
తనకరమ్మె తలగడగా
ఘనముగ గురు పెట్టి పెట్టి
బడలికతో నిదురించెను!

అప్పుడు పరమేష్ఠి ముఖము
లందు నున్న ప్రాజదువుల
దొంగిలించె హరిహయుడను
దుర్భావుడు రాక్షసుండు!

ప్రాజదువుల దొంగిలించి
పాథోనిధియందు దాగె!
వేదమ్ముల రక్షింపగ
వెలసెను హరి మత్స్యమ్ముగ!

మహామీనమూర్తిగ హరి
మకరాలయమున నిండెను



జలచరముల గూడి తిరిగి
జలనిధిలో సంచరించె!

హరి మును చెప్పిన రీతిగ
ధరణీశుడు సత్యవ్రతుడు
బీజమ్ముల నోషధులను
ఓజతోడ రక్షించెను!

పెద్ద చేప కొమ్ము నకును
పెనుపామున నావ గట్టి
సప్త ఋషులతోడ గలిసి
సత్యవ్రతుడు సంచరించె!

ప్రామిన్కుల దొంగిలించి
పాథోనిధి దాగియున్న
హరిహయుడను నా దానవు
నంతము గావించెను హరి

అంత ధాత నిద్ర నుండి
ఆవులించి మేల్గాంచెను
వేదములను వేధకిచ్చి
విష్ణు వరిగె వైకుంఠము!

అంభశ్చరముగ శ్రీహరి
అవతరించినట్టి గాథ
చదువుల దొంగను జంపిన
సదమలభాగవతసుధ!

* * *

# అజామిళుని కథ

కన్యాకుబ్జపురమ్మున
కలడు మున్ను విప్రుడొకడు
అతని పేరు అజామిళుడు
అతడు మిగుల పాతకుండు!

సదాచారముల కెడమై
సదా జూదముల నాడుచు
దాసిని తన భార్యగ గొని
తనయుల పలుపుర బడసెను!

మోహజలధి లోన మునిగి
ముచ్చట లందున దేలుచు
సుఖములెన్నొ యనుభవించి
చూడ నతడు వృద్ధుడయ్యె

జుట్టంతయు నెరసిపోయె
పట్టు తప్పె శరీరమ్ము
గడగడ తల వణకసాగె
కంటి చూపు తగ్గిపోయె!

దంతంబులు ఊడిపోయె
దగ్గుబాధ లధికమయ్యె
శిరోభార మది హెచ్చెను
చెదరెను సూమన మతనికి!

ఎనుబదెనిమిదేండ్లు నిండె
ఎంతో వృద్ధుండయ్యెను
చిన్నకొడుకుపై నతనికి
చెప్పలేని ప్రేమ యుండె





'నారాయణ' అతని పేరు
గారాబమ్ముల తనయుడు
తలిదండ్రులు ప్రేమ మీర
తనయుని చూడగ సాగిరి!

ముద్దుల సుతుగని విప్రుడు
మురిసి పోవుచుండె మిగుల
అతడే లోకంబయ్యెను
అతడిహపరములు మరచెను!

అతనికి కాలము మూడెను
అంత్యకాల మరుదెంచెను
చావు పైన బడెను కాని
చావదు సుతుపైన ప్రేమ

సమధికమగు శక్తులతో
యమకింకరు లరుదెంచిరి
వారిని గని అజామిళుడు
భయకంపితు డయ్యెనపుడు!

ఆటలందు తమ పుత్రుం
డనతిదూరమున నుండగ
ఆతడు 'నారాయణ' యని
అతి బిగ్గరగా పిలిచెను!

మరణ వేళ హరినామ
స్మరణ మతడు చేయగ హరి
దూతలు చనుదెంచిరి యమ
దూతల హడలగ జేసిరి!

విష్ణు దూతలారీతిగ
విక్రమమున యమదూతల
బారద్రోల యమదూతలు
వాదించిరి ఈ రీతిగ!

ఎవరు మీరు! ఎచటి వారు
ఇచ్చటి కరుదెంచినారు
మృత్యుశాసనము నీగతి
మీరెందులకడ్డు కొనిరి!

సుందర నేత్రములతో
సురుచిర రూపమ్ములతో
అద్భుతముగ నలరారెడు
అమరులొ! సిద్ధులొ! సాధ్యులొ!

శంఖ చక్ర గదాధరులు
చారు వక్ష చతుర్భుజులు
మణి గణ విభ్రాజమాన
మహిత కిరీట ధారులు!

అంతకు విధులకు నీగతి
ఆటంకము కల్పించిరి
అని కాలుని దూతలనగ
హరిదూతలు పలికిరిట్లు!
(**అంతకుడు** – కాలుడు, యముడు)

నిజ మితండు దుర్మతియై
నిజకుల ధర్మమ్ము మాని
దురాచార వర్తనుడై
దుష్టుడగుచు మెలగినాడు!



అంత్యకాల మందితండు
హరి నామము పలికినాడు
హరియించును పాతకముల
హరి నామము పలికినంత!

మురహరు నామస్మరణము
ముక్తికి మార్గము సత్యము
అజ్ఞానంబంతరించు
అభిమతముల నీడేర్చును!

కన్నకొడుకు పేరు పలికి
కమలాక్షుని పిలిచినాడు
మరణ వేళ యందితండు
మాధవనామము పలికెను!

అజామిళుని దురితమ్ములు
ఆ కారణముగ నశించె
శ్రీ కైవల్య పదంబును
చేరుట కీతండర్హుడు!

అని పలికిరి హరి దూతలు
అంతకు దూతల తోడను
ముక్తినంది అజామిళుడు
మురహరి లోకము పొందెను!

దండధరుని దూతలంత
దండపాణి పురికి నేగి
అజామిళుని కథ నంతయు
అంతకునకు వివరించిరి!

అంతకుడంతట యప్పుడు
అనుపమాన భక్తితోడ
శ్రీహరి రూపమ్మును తన
చిత్తమందు నిలిపి పలికె!

శ్రీహరి నామస్మరణము
శ్రేయస్కరమ్ము సతతము
నారాయణు పద భక్తుల
చేరవలదు మీరెప్పుడు!

భాగవతోత్తము సేవయె
భగవంతుల సేవ యగును
భాగవతుల పాదధూళి
పాపహరణ మతిశుభదము!

విష్ణుమహిమ లీరీతిగ
వివస్వతుడు వివరింపగ
విని వినమిత శిరస్కులై
వెడలిరంత యమదూతలు!

తెలిసిగాని తెలియకైన
తులసీదళధారి నామ
ముచ్చరించినను చాలును
ఉత్తమలోకాలు కలుగు!

అంత్య మందు "నారాయణ"
యని పలికి తరించి నట్టి
అజామిళుని చరితమిద్ది
హరి కథ భాగవత సుధ!

* * *

## ధ్రువుని కథ

అయిదేడుల పసి బాలుడు
అయ్యె నెట్లు హరి భక్తుడు!
వినగోరెద ధ్రువచరితము
వినిపింపుము మునినాథా!

అని పరీక్షితుం డడిగిన
వినిపించెను శుకమహర్షి
శ్రవణ పేయముగ నప్పుడు
ధ్రువుని చరిత్రము సాంతము!

స్వాయంభువ మనువునకును
సత్పుత్రుండుండె నొకడు
ఆతం డుత్తాన పాదు
లతివ లిద్దరా విభునికి!

సునీతి యొక భార్య పేరు
సురుచియను మరొక్క భార్య
సునీతి పుత్రుండు ధ్రువుడు
సురుచి సుతుం డుత్తముడు!

సురుచి పైన మిగుల ప్రేమ
చూపును ఉత్తానుండు!
సునీతి యందునను చిన్న
చూపుండెను ఆతనికిని!

ఒక్కనాడు సురుచి కొడుకు
నుత్తము తన తొడల పైన

ఆసీనుని చేసి ప్రియా
లాపంబులు పలుకుచుండె!

ఆ సమయంబునను ధ్రువుం
డచ్చటి కరుదెంచి తండ్రి
ఒడిలో కూర్చుండ నాత
డుత్సాహము చూపించెను!

అట్లు వచ్చు ధ్రువుని గాంచి
ఇట్లు పలికె సురుచి తాను
తండ్రి తొడల నెక్క కోర్కె
తగిలెనేని నీ మనమున
పుట్టి యుందు వీవు నిజము
పుత్రునిగా నా కడుపున!

కావున అథోక్షజు చరణ
కమలమ్ముల నాశ్రయించి
నా గర్భమ్మున పుట్టగ
నలిన నాభు వేడుకొనుమ్ము!

నా నందనునిగ జనించ
నానందముగా నప్పుడు
తండ్రి గారి తొడల నెక్కి!
తరియగలవు నిజము నీవు!

అనుచు సురుచి పల్కెనప్పుడు
జనకుడు వినుచుండ గనే!

ధ్రువుడప్పుడు ధృతిని బూని
నవనీరదదేహు గూర్చి



తపము చేయ విపినములకు
తరలిచనెను తత్పరుడై!

దారిలోన ధ్రువునకపుడు
నారదుండు కనిపించెను
తన సంకల్పమును ధ్రువుడు
తాపసి కెరుంగ జేసెను!

నారదుండు హర్షముతో
శ్రీరమణుని గూర్చి పాడి
హరి మహిమల తెలియజేసె
నానందమ్ముగ ధ్రువునకు!
ఇంకను ఆ దేవ మౌని
యిట్లు పలికె ధ్రువుని తోడ
మురహరుడే నిను పంచెను
మోక్ష మార్గమును బొందగ!

వాసుదేవు కరుణను నీ
వాంఛితములు నెరవేరును
శ్రీపతి రూపమ్మును నీ
చిత్తమున నిలుపుకొనుము!

వరయమునానది తటమున
హరిని గూర్చి తప మొనర్పు
మటమధు వనమందు నీవు
అబ్బాయీ! చనుము వేగ!

అనుచు పలికి నారద ముని
యతనికి ఉపదేశించెను

తపోధ్యాన పద్ధతులను
తత్పరుడై వినెనతండు!

హరికరుణను గూర్చి చెప్పె
హరి మహిమల వివరించెను
హరి రూపము వర్ణించెను
హరిని చేరు తెరవు తెలిపె!

నారదునకు ధ్రువుడంతట
నానా విధముల మ్రొక్కెను
తాను వెడలె నారదుడు
త్తానపాదు కడకు నపుడు!

ఉత్తానుండుచిత రీతి
నత్తాపసి నాదరించి
ఉత్తమాసనమ్మునందు
నుంచి పూజలొనరించెను!

ఉత్తానుని ముఖమందున
నున్న విచారమ్ము గాంచి
కారణమేమని యడిగెను
నారదుండు యుత్తానుని

తన సుతుండు ధ్రువుని తీరు
త్తానుడంత వివరించెను
అడవులలో తపము చేయు
కొడుకు గూర్చి విలపించెను!

అత్తాపసి ఉత్తానుని
అనునయించి పలికెనిటుల



రాజా! నీ తనయుడిపుడు
రాజీవాక్షుని గురించి!

తపమొనర్చు యమునా నది
తటమున మధు వనము నందు
ధ్రువుని గూర్చి లవలేశము
దుఃఖింపకు మనుచు పలికె!

నీ యశమ్ము జగములందు
నిలుపగలడు నీ సుతుందు
హరి భక్తుండై తరించు
నతని ప్రభావమ్మెరుగవు!

అని పలికిన నారదుండు
చనియెను తన మార్గమ్మున
ధ్రువుండచట మధువనమున
ధ్రువ తప మొనరించుచుండె!

సర్వేశ్వరు నామమ్మును
సతతము జపియించు చుండె
పండ్లు మాత్రమే తినుచును
పరమాత్మను ధ్యానించెను!
కొంత కాలమాకులు తిని
అంతర్యామిని కొలచెను
సలిల మాని కొంత తడవు
సరసిజాక్షు సేవించెను!

బొటన వ్రేలిపైన నిలిచి
పురుషోత్తము స్మరియించెను

ధ్రువుని తపోధ్యానమ్ముల
కవని ఎల్ల కంపించెను!

విశ్వమెల్ల తల్లడిల్లె
విబుధు లెల్ల వడికిపోయి
వడి వడిగా హరిని జేరి
పలు రీతుల మ్రొక్కులిడిరి!

దేవ దేవ! జగత్పతీ!
ధ్రువుని బ్రోవు మికనైనను
హరి! పరమాత్మా! కేశవ!
అతని కోర్కె దీర్పు మింక!

అనుచు సురలు వేడినంత
అనునయించి వారి పంపె
వారి వారి స్థానములకు
వాసుదేవు డతిముదమున!

విబుధుల మొరలాలకించి
విష్ణువు విహగేశ్వరుపై
ధ్రువుడు తపము చేయుచున్న
యవనికి చనుదెంచెనప్పుడు!

కమలాక్షుడు ప్రత్యక్షము
కాగ ధ్రువుడు కనుంగొని
శ్రీహరిని స్తుతింపగ తన
చేతమ్మున తల పోసెను!

వేదాత్ముని కీర్తించగ
వేడుకపడు పసి బాలుడు



శ్రీహరి సంకీర్తనంబు
చేయగ నసమర్థుడయ్యె!

ఆతని తలపెరిగినట్టి
యఖిలాత్ముండగు శ్రీహరి
ధ్రువుని కపోలమున నుంచె
దివ్యమైన తన శంఖము!

అంతట ధ్రువు డనుపమాన
ఆగమోక్తులను శ్రీహరి
సంకీర్తన తానొర్చె
సంతసముగ సంతృప్తిగ!

పసి బాలుండగు ధ్రువుండు
పరమాత్మను హరి గొలిచిన
పరమానంద మొసంగెడు
భాగవతకథా సుధ యిది!

* * *

## రంతిదేవుని కథ

రంతిదేవు డేరీతిగ
రాజిలెను మహాదాతగ
విన గోరెద మునినాథా!
వినిపింపుము కరుణ తోడ!

పరీక్షిత్తు శుక యోగిని
ప్రార్థన గావించినంత
రంతిదేవు చరితమ్మును
అంతట వినిపించెను ముని!

రంతిదేవు కీర్తి యనగ
యింతింతనరానిదగును
మహాదాతగా నతండు
మహి యందున పేరు పొందె!

ఆతడు తన సంచితార్థ
మంతయు దీనుల కొసంగి
అన్నము నీరమ్ము లేక
అతి ధైర్యముగా నుండెను!

కూడు నీరు లేక యతడు
కుటుంబ సహితముగ నుండె
నిలువ నీడ లేకుండగ
నలుబది ఎనుబది దినములు!

ఒక్కనాడు అతనికపుడు
చక్కని భోజనమబ్బెను





నెయ్యి పాయసమ్ము దొరకె
నీరందెను దప్పికకు!

ఆకలి దప్పిక తోడను
అతడు దస్సియుండె మిగుల
సకుటుంబముగా నాతడు
సంతసించి కుడువ బూనె!

అపుడొక్క విప్రుడు వచ్చి
ఆహారము నడిగె నతని
ఆ విప్రుని యాదరించి
హరి సమర్పణమ్మ నుచును
అన్నములో సగము నీయ
ఆతడు భుజియించి యేగె!

అంతలోనె నొక శూద్రుడు
అశనార్థిగ వచ్చె తాను
ఆ మిగిలిన సగములోనె
అర్ధబాగ మిచ్చెను తను!

ఆతడు సంతుష్టు డగుచు
ఆహారము తిని చనియెను!

అటు పై కుక్కల గమితో
అటకొక్కడు ఏతెంచెను
అన్న శేష మిచ్చి పంపె
నతనికి ఆ దాన శీలి!

వచ్చెనొక్క చండాలుడు
వడి వడిగా నచటికపుడు

దప్పికతో నున్నాడను
దయతో కాపాడుము నను

రాజా! జలమింత యిచ్చి
ప్రాణమ్ముల కాపాడుము
హీనుడ! నే చండాలుడ
మానవేశ! బ్రోవుమయ్య!

ఆ దాహార్తుని మొర విని
అనియె నిట్లు రాజప్పుడు
అన్నము నా వద్ద లేదు
అన్నా! త్రావుము నీరము!

శరీర ధారులకు వచ్చు
సకల విధమ్ముల బాధలు
వారి వారి ఆర్తి తొలగ
వారికి సాయము చేయగ
వాసుదేవ సేవ యగును
వాడే నాకిక దిక్కు!

అనుచు పలికి రంతి దేవు
డప్పుడు ఆ చండాలుని
పాత్రమ్మున నింపెనప్పుడు
పానీయంబును మొత్తము!

అప్పుడు బ్రహ్మాది సురులు
అతని దాన గుణము మెచ్చి
రంతి దేవు నెదుట నిలిచి
రనువుగ నిజరూపమ్ముల!



విష్ణు మాయ వలన నిట్లు
వివిధ రూపములు ధరించి
అతనిని పరీక్ష చేసితి
మనుచు పలుక సురలందరు!

వారల వరముల నడుగక
నారాయణ పద భక్తిని
ఆ రంతి దేవుడడంగి
ధీరుండై నిలిచెనప్పుడు!

మాయకు లోనవక తాను
మాధవపద భక్తి కలిగి
పరమ పదము బొందె నతడు
పరమానందమ్ము తోడ!

ఆ రాజర్షిని గొలిచిన
వారెల్లరు వైభవముగ
నారాయణ చింతనతో
చేరిరి సిద్ధపదమ్మును!

మహాదాతయగుచు తాను
మహిలో విఖ్యాతి గన్న
రంతి దేవు చరితంబిది
రసమయ భాగవత సుధ!

* * *

# బాణాసుర కథ

బాదరాయణాత్మజుడా!
బాణాసుర కథ చెప్పుము
అని పరీక్షిత్తడిగినంత
వినిపించెను శ్రీ శుక ముని!

బలికి నందనులు నూర్గురు
బాణు డతని కగ్రసుతుడు
ఆతడు సహస్రహస్తుడు
ఆతండత్యుగ్రమూర్తి!

బాణాసురు డొక్కసారి
పార్వతీశు వద్దకేగి
భక్త పాలనా! శంకర!
బాణాసురు మనవి వినుము!
అని యాతడు విన్నవించె
నమితభక్తితో నీ గతి

దేవా! నా వాంఛితమును
తేటపడగ విన్న వింతు
నీవు అద్రినందనతో
నిటలనేత్ర! నా వాకిట
కాపుండుము విశ్వేశ్వర!
కరుణ తోడ కాదనకుము!
నీ చరణమ్ముల భక్తిగ
నిత్యము నేసేవించెద!

అని బాణుడు వేడుకొనుగ
ఔననె నా పరమశివుడు!



తన పరివారమ్ము తోడ
చనెను శోణపురి కప్పుడు
భక్తు కోర్కె చెల్లించగ
భక్తవశంకరుడు హరుడు!

బాణుడు సంతోషమ్మున
భవుని సంస్తుతించె నిటుల
పరమశివా! జగన్నాథ!
పార్వతి హృదయాధినాథ!
మునిజన వందిత! సురనుత!
మోహ దూర! శూల హస్త!
గరళకంధరా! మహేశ!
ఉరగ హార! విషాహార!
ఇందు భూష! భక్తపోష!
ఇంద్రవందితా! యభవా!

అని నుతించి పరమశివుని
అనె నిట్టుల శివునితోడ
అనిలో నను గెలువ గలుగు
ఘనుడెవ్వడు పరమశివా!

బాహువులొక వేయి యుండి
ఫలమదేమి పరమశివా!
రణకండూతి తొలంగు మా
ర్గంబది చూపుము అభవా!

అని బాణుడు మూర్ఖుడగుచు
అడిగె నభవు, శివుడనియెను!

మూఢా! నీ కేతనమ్ము
భువి పై కారణమ్ము గ
కూలు నెప్పుడో యప్పుడె
కోర్కె నీది తీరగలదు!

నీ భుజముల దురద తీరు
నీ బాహు సహస్రమ్ములు
ఖండింపం బడు ననుచును
ఖండేందు ధరుండు పలికె!

బాణుడు సంతసమున తన
వాసమ్మున కరిగె నపుడు
నిరీక్షించు చుండె నతడు
నిజ ధ్వజ నిపాతమునకు!

ఉషా కన్యయను పేరున
నున్నది బాణున కొక సుత
ఆ సుందరి యిందు వదన
అరవిందదళాయతాక్షి!

ఆ సుందరి యొక్కతె సౌ
ధాగ్రమందు నున్న వేళ
అరుదెంచె ననూహ్యమ్ముగ
అనిరుద్ధుండను యువకుడు
ఆమె తోడి గవసి పోయె
నందగాడు అచ్చెరువుగ!

కలలో నీ రీతి జరుగ
కలవర పడె నా సుందరి
తెలివి గలిగి మేలు కొనగ
తెలిసెను సమస్త మామెకు!



ఆ సుందరు డతి ప్రేమగ
నతను కేళి సలిపినట్లు!

ఆమె మిగుల సిగ్గు పడెను
అమిత మోహమది క్రమ్మెను
మదన తాప మతిశయిల్లె
మరి మరి విరహమ్ము పెరిగె!

బాణుని అమాత్యుడగు కుం
భాండు తనయ చిత్ర రేఖ
ఉషకు బహిఃప్రాణ మనగ
నున్నది అనుంగు నెచ్చెలి!

చిత్ర రేఖ యుషా కన్య
చిత్రమైన తీరు గాంచి
ఏమి జరిగె చెప్పు మనుచు
కోమలి బలవంత పెట్టె!

ఉషా కన్య చెలియ కపుడు
ఉన్నది యున్నట్లు చెప్పె!
విరహ బాధ తోడ నామె
దురపిల్లెను చెలి ముంగిట!

ఉషా బాల నోదారిచి
హుషారుగా చిత్రరేఖ
సుందరి యా సుందరాంగు
సురుచిర చిత్రమ్ము నిపుడు
నేర్పొప్పగ రచియింపుము
నేగొని వచ్చెద నతనిని!

చిత్రరేఖ ఉష మాటల
చిత్రమ్ములు రచియించెను

తను కలలో కలసి నట్టి
యువకునిగనె నుషా బాల!

చిత్ర రేఖ చెప్పెనపుడు
చిరకాలము తానెరిగిన
సుర యక్షోరగ కిన్నర
ధరాధి నేతలను గూర్చి!

ఒక్కొక్కరి గూర్చి యామె
చక్కగ వర్ణించి చెప్ప
తను కలలో కలిసి నట్టి
అనిరుద్ధుని చిత్ర మరసి!
ఆనందం బుప్పొంగగ
యనెను చిత్రరేఖ తోడ!

అతివా! నా మానధనము
హరియించిన ముచ్చితండె
ఎవ్వరితడు! ఎచటి వాడు!
ఈ సుందరు గూర్చి చెపుమ!

అని పలికిన ఉషాబాల
కనియె నిట్లు చిత్ర లేఖ
అనిరుద్ధుండీతడు కృ
ష్ణుని మనుమండనఘుడితడు!

ఈ క్షణంబ యేగినేను
ఈతని గొని వచ్చెదనని
మారు మాట వినకయామె
ద్వారవతి పురమ్ముకేగె!



ఆ పురమ్ము చని బిరాన
అనిరుద్ధుని గని వెంటనె
తన యోగ బలమ్మున నా
తని గొని శోణపురము జనె!

ఉంచెను అనిరుద్ధు నప్పు
డుషాకన్య తల్పమ్మున!

అంభోరుహదళనేత్రా!
అనిరుద్ధుని కను మిదిగో!
యని పలికెను చిత్ర రేఖ!
యానందం బుప్పొంగగ!

ఆ పై పలు విధముల నుష
ఆమె నేర్పుపొగడి పంపె
అనిరుద్ధునితో నిత్యము
అనంగకేళిని తేలెను!

ఆ లోనన ఉషకంతట
చూలేర్పడి గర్భ మొదవె
అంతఃపుర చారికంత
నంతయు బాణునకు దెలిపె!

ఆగ్రహించి బాణుడంత
అతిరభసమ్మున నేగెను
కన్యాసౌధమున కపుడు
కనియె నచట అనిరుద్ధుని!

అసురాధిపు డాగ్రహమున
అనిరుద్ధుని బంధింపగ
అసురానీకమ్ము నంపె
అత్యుగ్రమ్ముగా నప్పుడు!

అనిరుద్ధుని కసురులకును
అని జరిగెను భీకరముగ
అని రుద్ధుడు వారి జంప
అసురేంద్రుం డాగ్రహించె!

అహిపాశమ్ముల తోడను
అనిరుద్ధుని బంధించెను
ఉషాబాల భర్తను గని
విషాదమున దుఃఖించెను!

ఆలోనన యాతని ధ్వజ
మకారణమ్ముగ గూలెను
సంతసించె బాణాసురు
డంత పోరు జరుగునంచు!

ద్వారకలో అనిరుద్ధకు
మారుడు మాయమ్మగుటను
యదు సమాజమది మొత్తం
బతి దుఃఖమ్మున మునిగెను!

ఒక్కనాడు దేవ మౌని
చక్కగ ద్వారకకు వచ్చి
అనిరుద్ధుని గూర్చి మౌని
యంతయు వివరించె నపుడు!

విని కృష్ణుడు క్రుద్ధుండై
ఘనమగు తన ఆయుధములు
శంఖ చక్ర గదలు దాల్చి
సంగరమున కేగెనపుడు!



బాణుడు తన సైన్యముతో
వేణుధారి నెదుర్కొనెను
ఆ రణఘోషకు నప్పుడు
అవని ఎల్ల దద్దరిల్లె
దివి వడంకె, దిక్కులదరె
రవిచంద్రుల గతులుడిగెను
బాణుని పక్షము వహించి
స్థాణుడు రణమున కేగెను!

శివ కేశవ యుద్ధమరయ
దివిజులాకసమున నిలిచి
రనలాక్షునకును హరికిని
అని జరిగెను ఘోరమ్ముగ!

మహాదేవమాధవులును
మహాస్త్రములతో పోరిరి
మహాహవము జరిగె నపుడు
మహి ఎల్ల వడంకె నపుడు!

పశుపతి పాశుపతాస్త్రము
హరినారాయణ బాణము
ప్రయోగింప సమ కట్టిరి
ప్రళయము కలుగగ నప్పుడు

జృంభణ శర మేయగ హరి
శంభుడపుడు మూర్ఛిల్లెను
మిగిలిన సైన్యం బెల్లను
పొగిలి పొగిలి పారిపోయె!

బాణుడనికి వచ్చి శార్ఙ్ఞ
పాణి నెదుర్కొనె నంతట
వారిరువురి మధ్యయపుడు
పోరు ఘోరముగ సాగెను!

కృష్ణుడు దరహాసముతో
వైష్ణవ జ్వరమును పంపగ
పారి పారి బాణుడు హరి
పాదమ్ముల నాశ్రయించె!

బాణుని రక్షింప చక్ర
పాణిని ప్రార్థించె శివుడు!
బాణుబాహు లుడిగి నాల్గు
బాహువులే మిగిలె నపుడు!

ప్రాణభిక్ష పెట్టగ హరి
బ్రతుకు జీవుడా యనుకొని
శోణపురమ్మున కేగెను
ప్రాణమ్ముల నిలుపుకొనెను!

ఉషానిరుద్ధుల గైకొని
యుజ్జ్వలమగు తన రథమున
ద్వారక కేగెను కృష్ణుడు
వారక విజయమ్ము పొంది!

ఇది బాణాసురుని గాథ
ఇది భాగవతకథా సుధ
ఈ కథ పఠియించు వారి
కీశు కరుణ లభియించును!

* * *



# స్యమంతకమణి కథ

పరీక్షిత్తు శుక యోగిని
పరమ భక్తితో నడిగెను
స్యమంతకమణి గాథను
సదయుడ! వినిపింపు మనుచు!

పరీక్షిత్తు దతుల భక్తి
పరమయోగి నడిగినంత
సహర్షముగ శుకు డంతట
స్యమంతకమణికథ చెప్పెను!

సప్తాశ్వరథుండగు భా
స్కరునకు సత్రాజిత్తతి
భక్తుండై పూజ సేయ
భాస్కరుండు హర్షమందె!

స్యమంతకమణి నొసంగెను
సత్రాజిత్తుకు సూర్యుడు
మణి ధరించి సత్రాజితు
మరొక సూర్యు వలె వెలిగెను!

మణి దాలిచి సత్రాజితు
మగుడ ద్వారకకు వచ్చెను
ఆతని మణి ప్రభల గాంచి
అచ్చెరువందిరి ప్రజలు!
శ్రీకృష్ణుని వద్దకేగి
చెప్పిరతని గూర్చి వారు!

నారాయణ! దామోదర!
నీరజాప్తుడో! బ్రహ్మయో
నినుజూడగ వచ్చినాడు
ఘనముగ ద్వారక కిప్పుడు!

అని పలికిన జనుల గాంచి
అనియె నిట్లు గోవిందుడు
ఆతడు మన సత్రాజితు
డహస్కరుడు, బ్రహ్మ గాడు!

మణి ధరించి సత్రాజితు
తన గృహమ్ము చేరుకొనెను
మహీసురులచే పూజా
మందిరమున మణి నిలిపెను!

దిన దినమును స్యమంతక
మ్మెనిమిది బారువుల కనక
మొసగుచుండె సత్రాజితు
కసమానమ్ముగ నలరుచు!

ఏ రాజేలెడు పుడమిని
యా రత్నము పూజలందు
నా రాజ్యము సుభిక్షముగ
నలరారును పుడమిపైన!

ఆ మణి రాజుకు నిమ్మని
హరి సత్రాజిత్తు నడిగె
తిరస్కరించె సత్రాజితు
హరి మాటలు వినకుండగ!



అమ్మణి కంఠమున దాల్చి
ఇమ్ముగ ప్రసేను డొకపరి
మృగయారతి నడవి కేగె
మిక్కిలి వేడుక తోడను!

అతని జంపి సింహ మొకటి
ఆ మణిని గ్రహించి యేగ
జాంబవంతుడను భల్లూ
కంబు చంపె సింహమ్మును!

ఆ మణిని గ్రహించి భల్లూ
కముగొని తన గుహకు నేగి
అందమైన సుత కేళీ
కందుకమ్ముగా నుంచెను!

తన సోదరుడైన ప్రసే
నుని గానక సత్రాజితు
హరియే తన సహోదరుని
పరిమార్చెనని నిందించె!

దోషరహితుడగు కృష్ణుడు
దూషణముల విని తనపై
వచ్చిన నిందలు తొలగగ
వాసు దేవుడపుడు పూనె!

విపినమ్మున కేగిన హరి
వివరమ్ముల తెలిసికొనెను
ఏగతి మడసెను ప్రసేను
డేగతి సింహమ్ము మడిసె

మడిసిన సింహమ్ము నుండి
మణిగొని ఎలుగేగతిజనె
తన గుహలో తన సుతకది
మణినేగతి నిచ్చెననుచు!

సమాచార మెరిగిన హరి
సాహసముగ గుహకు నేగి
తన వారిని బైటనిలిపి
తన మాత్రము లోనికి జనె!

బాలిక కెదురుగ గుహలో
వ్రేలాడెడు మణినిగాంచి
హరింపగా స్యమంతమును
హరి నిశ్చయ మొనరించెను!

మెల్లగ మెల్లగ నడచుచు
నల్లనయ్య చనె, గుండెలు
జల్లన ఆ బాలదాది
జడిసి పెద్దగా అరచెను!

ఆ ధ్వని విని జాంబవంతు
దరుదెంచెను వెలుపలకు
వచ్చిన శ్రీకృష్ణు గాంచి
ప్రాకృత పురుషునిగ నెంచి
తలపడె రణమున కప్పుడు
తన బలమును నమ్ముకొని!

ఆ పోరాటము సాగిన
దష్టావింశతి దినములు



అడిదమ్ములు తరులు విరిగె
పిడికిటి పోటులు హెచ్చెను
బాహాబాహిగ పోరెను
భల్లూకము శ్రీకృష్ణుడు!

ముష్టిఘాతములనప్పుడు
మురహరి పొడవగ నెలుంగు
పిశంగోరు శరీరుండు
నష్టపడెను శక్తులుడిగి!

అప్పుడు భల్లూక మెరిగి
ఆ వచ్చినది హరేనని
పలువిధముల శ్రీ కృష్ణుని
భల్లూకము నుతియించెను!

తనకిచ్చిన మాట కొరకు
తనతో పోరాడిన దా
దశరథ రాముడటంచును
తానెరిగెను భల్లూకము!

సమర మొనర్చిన యెలుగును
నిమిరె నంత శ్రీకృష్ణుడు
భల్లూకము దేహబాధ
పటాపంచలయ్యె నప్పుడు!

గంభీరమ్ముగ నప్పుడు
అంభోజాక్షుండనియెను
మణిని దొంగిలించితినని
నను నిందించిరి కొందరు!

నిందలు తొలగించు కొనగ నీ
మందిరమునకును నీగతి
వచ్చితి భల్లూకేశ్వర
వచ్చి యుద్ధ మొనరించితి!

అంత సంతసమున జాంబ
వంతుడు హరికిచ్చె మణిని
మణి నొసంగి తన కన్యా
మణిని జాంబవతి నొసంగె!

జాంబవతీ సహితుండయి
అంబుజ నేత్రుం దరిగెను
తన పురమగు ద్వారకకు
తన వారానందింపగ!

సత్రాజిత్తును భూపతి
సభకు పిలిచి మణి నొసంగె
మణి గ్రహించి సత్రాజిత్తు
మరి, పశ్చాత్తాపమందె!

సత్రాజితుడింటికేగి
చచ్చి పోయె సిగ్గుతోడ
తన పొరపాటుకు మిక్కిలి
మనమున దుఃఖించె నప్పుడు!

పాపాత్ముడ దుర్మతినని
పరిపరి విధముల పొగిలెను
తన కుమార్తె యగు సత్యను
దనుజవైరి కీయనెంచె!



స్యమంతకమ్మును, సత్యను
సరసిజాక్షునకు నొసంగ,
సత్యను గ్రహించి శ్రీహరి
సత్రాజితు తోడననెను!

మాకు చాలు భార్యామణి
మాకు గలవు మణులు పెక్కు
సత్రాజిత్తున కొసగెను
స్యమంతకమ్మును నవ్వుచు!

ఇది స్యమంతకమణి కథ
సదమల భాగవత సుధ
అపనిందలు తొలగిపోవు
నతి భక్తిగ దీని చదువ!

* * *

# యయాతి కథ

బ్రాహ్మణుండు భార్గవునకు
పార్థివుడగు ఆ యయాతి
అల్లుడయ్యె నేవిధముగ
ఆ కథ శుకముని తెలుపుము!

అనుచు పరీక్షిత్తడుగగ
అనుపమాన కథాకథన
దక్షుండగు శుకమహర్షి
తక్షణంబు వినిపించెను!

అసురాచార్యుడు శుక్రుం
డతని పుత్రి దేవయాని!
దనుజేశుడు వృషపర్వుం
డతని తనయ శర్మిష్ఠ!

పొద్దుపోక దనుజ పుత్రి
పురము వీడ యడవికి జనె
పూచిన పూదోటలందు
ముచ్చటగా తిరిగె నామె!

ఆమెతోడ వనికి నేగె
నసురాచార్యుని పుత్రిక!
దేవయాని శర్మిష్ఠలు
తిరుగాడిరి వనమంతయు!

వారిజాక్షులంత గనిరి
వారొక జలాశయమ్మును
వలువ లూడ్చి వారు దిగిరి
జలములందు నీదులాడ!



కొలను నందు వారందరు
కోర్కె దీర జలకమాడ
అంతలోన నంది నెక్కి
అభవుండటుచనుదెంచెను!
గిరిజ తోడ కలసి శశియు
శిరము నందు కాంతు లీన!

కన్యలెల్ల సంభ్రమమున
కడు సిగ్గున ఒడ్డు చేరి
వలువలు ధరియించి రపుడు
బిల బిలమని వేగమ్ముగ!

తమకమ్మున వస్త్రములను
తారుమారుగా ధరించె
నసురపుత్రి దాల్చె దేవ
యాని కట్టు వస్త్రములను!

దేవయాని ఆగ్రహించి
తిట్టుచు నీగతి పల్కెను
దాసి వంటి శర్మిష్ఠయె
దాల్చెనిపుడు నా వలువలు!

మేమెవరము బ్రాహ్మణులము
మిక్కిలి కొలమ్మువారము
నాక వైరి సేవించును
నా పిత శుక్రాచార్యుని!

శుక్రుండెవరను కొంటివి
సుధీమణులు సేవింతురు
మహీసురుల వలువలు పెర
మరువలు ధరింపగలరే!

పసిడి గొలుసు దాల్చ హవి
ర్భాగమునకు తగునె కుక్క!
అని ప్రేలెడు దేవయాని
కని అనియెను శర్మిష్ఠయు!

భిక్షుకుడై నీ పితయును
కుక్షి నింపుకొను నిత్యము
అసురేంద్రుడు నా తండ్రిని
అను నిత్యము సేవించును!

రాజసుతను సుగుణమణిని
రాజసమ్ము గల దానను
దీని పొగరు తొలగు నట్లు
దీనిని బావిని త్రోయుడు
అనుచు చెలుల కానతియిడె
దనుజ పుత్రి ఆగ్రహించి!

అసురేంద్రుని తనయ యట్లు
ఆగ్రహమున నాజ్ఞసేయ
బ్రాహ్మణ సుతనంత వారు
బావిలోకి నెట్టినారు!

కుతిక లోతు నీటిలోన
కునారిల్లె దేవయాని
అటుగా వేటకు వచ్చెను
ఆ సమయమ్మున యయాతి!

క్రీడాసింధువునందున
చేడియ యుండగగనుగొని
రక్షింపగ నా యయాతి
దక్షిణ కరమందించెను!



నూతి నుండి సుందరి చే
యూత గొనుచు పైకి వచ్చె
తడిసిన యామెకు యయాతి
తడయక పొడి చేలమిచ్చె!

నూతినుండి వెడలి నట్టి
నాతి పలికె నీ రీతిగ
నా పాణిని బట్టు కతన
నాకు భర్త వైతి నీవు!

దైవమిట్లు కలిపె మనల
తప్పదు సిద్ధం బియ్యది
దనుజాచార్యుడు శుక్రుని
తనయను నే దేవయాని,
తొల్లి కచుని ప్రేమించితి
నొల్లడతడు నా ప్రేమను!

ఆకతమున శపియించితి
నతని విద్య లుడిగి పోవ
మగుడ కచుడు నను శపించె
మగండు బాపడు కాడని!

కావున బ్రాహ్మణు డెన్నడు
కాజాలడు నా పెనిమిటి
నీవె నాకు భర్తవనుచు
దేవయాని పలికె నపుడు
అదను చూసి యయాతి పై
మదనుడపుడు దాడి చేసె!

యయాతి హృదయమ్ము దేవ
యాని పైన నిలిచెనంత
ఈశ్వరాజ్ఞ ఇట్టి దనుచు
ఎంచె రాజు తనమనమున!

భూసుర పుత్రిని సతిగా
పొంది వెడలె నా యయాతి!

శుక్రుజేరి దేవయాని
సూది గ్రుచ్చినట్లు జెప్పి
శర్మిష్ఠను గూర్చి ఏడ్పు
జడివానను గురిపించెను!

విలపించెడు సుతను గాంచి
విలవిల లాడెను శుక్రుడు
వృషపర్వుని సేవించుట
వృథగా బావించె నపుడు!

తనయ తోడ గురువప్పుడు
దనుజు వీడి పోనెంచెను
అసురవరుండది యెరింగి
అతని యత్నమును మాన్పెను!

కినుక మాని దనుజు గురువు
అనియె నిట్లు దనుజునితో

నీ సుత దాసి విధమ్ముగ
నా సుత నిక కొలువ వలయు
లేని యెడల నీ గురువుగ
నేనుండ నటంచు పలికె!



అసురాచార్యుని మాటలు
నసురుం డౌదల దాల్చెను
అసురజాతి హితము గోరి
అనుగుసుతను దాసి జేసె!

యయాతికిని దేవయాని
కంతట నసురాచార్యుడు
విధివిధానముగ నప్పుడు
వివాహమ్ము జరిపించెను!

తండ్రి పనుప శర్మిష్ఠయు
దాసి యగుచు తానరిగెను
దేవయాని వెంట నపుడు
సేవకురాలిగ నగుచును!

శుక్రుడు చెప్పె యయాతికి
సుతహితమ్ము గోరుకొనుచు
శర్మిష్ఠ తోడనెపుడును
సంగమంబు చేయకుమని!

యయాతి దేవయానులకు
యదు, తుర్వస సుతులు గలిగె
శర్మిష్ఠతో యయాతియును
సంగమించె నొక రాతిరి!

యయాతికిని శర్మిష్ఠకు
ద్రుహ్యుడు ననువును బూరుం
డను పుత్రులు కలుగ, నంత
నది ఎరిగెను దేవయాని!

బుస కొట్టుచు క్రోధముతో
పోయి తండ్రి వద్దకపుడు
శుక్రాచార్యునకు తెలిపె
సుదతి పూస గుచ్చినట్లు!

కోపించిన శుక్రుడంత
శపించె యయాతినప్పుడు
ముదిత లెల్ల రోయు నట్లు
ముదిమి మీద బడునంచును!

అంతట యయాతి నసుగుచు
అసురాచార్యున కనియెను
మామా! నీ పుత్రి యందు
మానదు మోహమ్ము నాకు!

అమె తోడ ననుభవింతు
కామమ్మును మన్నింపుము
అనుచు దేవయాని గూడి
చనియె నంత తన పురముకు!

తన తనయుల తోడను శు
క్రుని శాపమును తెలిపె
తన మనోవాంఛ తెలుపుచు
తనయుల నందరను నడిగె!

తన ముదిమిని గొని వారి
యౌవనమును తనకిమ్మని!
యదు తుర్వస ద్రుహ్యులనువు
ముదిమిని గొన నొల్ల రైరి!



పూరుడు శర్మిష్ఠ సుతుడు
ముందుకు జని తండ్రిగారి
ముదిమిని గొని, తన యౌవన
మును తండ్రిగారి కొసగగ!

నాన్నా! నీ ముదిమి గొనగ
నాకు బాధ లేదు సుంత
కన్న తండ్రి సుఖము కన్న
మిన్నయున్నదే జగమున!

అని పలికిన పూరుడు యౌ
వనమును తన తండ్రి కిచ్చి
ముదిమిని గొనె వెనువెంటనె
మోదమ్మున తండ్రి నుండి!

తరుణుండగుచు యయాతియు
తనిసెను సుఖభోగమ్ముల
పెద్ద కాలమున కాతని
పెను అజ్ఞానమ్ము వదిలె!

తన రాజ్యమ్మును యయాతి
తనయుడు పూరున కిచ్చెను
ఇంద్రియముల గెలిచియును ము
నీంద్రుండై ముక్తి నందె!

పురుని పేర వృద్ధి చెంది
పురు వంశం బేర్పడియెను
ఇది యయాతి చరిత్రమ్ము
సదమల భాగవత సుధ!

* * *

# దక్ష ప్రజాపతి కథ

మునివర్యా! కరుణ తోడ
వినిపింపుము దక్షు కథను
అని యడిగిన పరీక్షితుని
కని, చెప్పెను శుకుడు కథను!

ఆదియందు ప్రజాపతుల
నజుడు సృష్టి యొనరించెను
వారి లోన దక్షుడొకడు
ప్రసూతి యాతనికి భార్య!

ఒకపరి సరసిజగర్భుం
డొడ్డోలగమై యుండగ
దక్షుడచటి కేతెంచగ
తనర నందరును లేచిరి!

పంకజాసనుండు మరియు
శంకరుండు లేవలేదు
దానిని గమనించి యంత
దక్షుడు కినుక వహించెను!

అందరునూ లేచి నిలువ
ఇందుధరుడు నిలువ కున్న
తన నవమానించె నంచు
దక్షుడంత నాగ్రహించె!

శివుని తిట్టుచును దక్షుడు
చేసెను దుర్వ్యాఖ్యలెన్నొ



ఇందుధరుని ఆగ్రహమున
నిందించెను పలువిధాల!

తన కూతురు నతని కిచ్చి
తన నల్లునిగా జేకొని
తప్పు చేసి నాడంచును
తప్పుడు మాటలు పలికెను!

అంతనతడు జలముల గొని
అంత కాంతకుని శపించె
యజ్ఞహవిర్భాగంబులు
నతనికి దక్కవు పొమ్మని!

శివుని పట్ల నీ రీతిగ
చేసెను దుర్నిందలనుచు
సురలు మౌనులును దక్షుని
నిరసించిరి కోపించిరి!

ఆగ్రహించి నందీశ్వరు
డవని సురుల నిందించెను
భృగు మహర్షి నందీశ్వరు
మగుడ యపుడు నిందించెను!

ఆ పిమ్మట దక్షుడొక్క
అరుద్రకమ్మగు యాగము
తలపెట్టెను సురల మునుల
పిలిచెను, శంకరుని దక్క!

వేగముగ వియద్గణంబు
యాగమునకు పోవుచుండె

దాక్షాయణికిని శివునకు
దక్షుడు కబురంప లేదు!

విమానములు గుంపులుగా
వియచ్చరులు పోవుచుండ
దాక్షాయణి ఎరిగె నంత
తండ్రి చేయు మఖము గూర్చి!

పరమశివుని వద్ద కేగి
పలికె నామె ఈ రీతిగ
మహాశివా! నా పితరుడు
మహాయాగ మొకటి చేయు!

దానికి నే పోనెంచద
దయతో అనుమతి నొసగుము
అనుచు వేడ దాక్షాయణి
అభవుండనె నీరీతిగ!

పిలువని పేరంటమునకు
వెళ్లుట మంచిది కాదని
ఎరుగుదువేకద నీగతి
అరుగుట మంచిది కాదు!

అని పలుకగ పరమ శివుడు
ఆమె యనిన దీ రీతిగ!

నా సహోదరీమణులును
నాగభూష! మఖమును గన
వత్తురు వారిని గనగా
చిత్తమున కోర్కె గలిగె!



కరుణాకర! యాగమ్మును
కనబోవగ ననుమతిమ్ము
యని పలుకగ దక్షపుత్రి
యనుమతించె పరమ శివుడు!

దక్షుని గర్వము నంతయు
దాక్షాయణి కెరుగ జేసె!
చనియెనంత దాక్షాయణి
జనకుని యాగమ్ము కనగ!

ఆ గతి యాగము కనగా
యా పరమేశ్వరి చనగా
తండ్రి పలుకరించ లేదు
తనర సురలు పలుక లేదు!

తన తల్లియు పినతల్లులు
తన తోబుట్టువు లందరు
తన నాహ్వానించె గాని
దాని యందు ప్రేమ లేదు!

తన నవమానించి నట్టి
తండ్రిని నిందించి యపుడు
యోగాగ్నిని దగ్ధమయ్యె
యాగభూమి లోన నామె!

అది కనుగొన హా! హా! రవ
మొదవె యాగ భూమి యందు
ఆ జరిగిన ఘటన కపుడు
అవాక్కయిరి సురలెల్లరు!

ఉగ్రున కది తెలిసినంత
ఆగ్రహమున నూగి పోయె
జటనొక్కటి పెరికి భూమి
చక్రమ్మున విసరి కొట్టె!

జ్వాలలు రేగినప్పుడు
జ్వాలలో జనించెను జా
జ్వల్యమానముగ నప్పుడు
జటలు గలుగు మూర్తి యొకడు!

ఆతడు మహోగ్ర నేత్రుడు
ఆతడమిత తేజస్కుడు
కపాల మాలలు దాల్చిన
ఘనుడు వీరభద్రుడతడు!

అభవా! నేనేమి సేయ
నానతీయు మనెనప్పుడు
అభవు డానతిచ్చె దక్షు
యాగము ధ్వంసము చేయగ!

వీరభద్రుడంత మహా
వీరరూపమున నప్పుడు
దక్షయజ్ఞమున కేగెను
శిక్షించెను సురల నెల్ల

దిక్పాలురు భయము చేత
దిక్కు లేక పరుగులిడిరి
యాగశాల భస్మమయ్యె
యజ్ఞకుండములు చెదరెను!



హోమకుండమందు దక్షు
నుత్తమాంగ మది తెగి పడె!
వీరభద్రుడీరీతిగ
ఘోరకృత్య మాచరించి
గరళగళుని దర్శింపగ
కైలాసమ్మున కేగెను!

దిక్కు లేక పారినట్టి
దిక్పాలురు దేవతలును
అజుని సూచన నవునందరు
నభవుని గని మొర పెట్టిరి!

పరమ శివుని చేరివారు
పరి పరి విదముల స్తుతింప
పరమ శివుడు సంతసించె
సురల, మునుల కరుణించెను!

కమలాసనడంత గరళ
కంధరు నీ రీతి వేడె
దేవదేవ దక్షు పున
ర్జీవితు నొనరిపుమయ్య!

అనుచు ధాత వినయమ్ముగ
నప్పరమేశుని వేడగ
దయామయుడు పరమశివుడు
దక్షుని కరుణించెనంత!
అజశీర్షము తడ దక్షు
డంత జీవితుండయ్యెను!

తన కల్మషములు దహింప
దక్షుడంత స్తుతియించెను
శంకరు సకల హితంకరు
సకల దురిత నాశంకరు!

తన యాగమ్మును పిమ్మట
దక్షుడు పూర్తి యొనర్చెను
యజ్ఞపురుషుడగు విష్ణువు
యాగమునకు వచ్చెనప్పుడు!

హరిని గన్న సురలందరు
హర్షమ్మున స్తుతియించిరి
ఇది దక్ష ప్రజాపతి కథ!
సదమల భాగవత సుధ!

* * *

## పరశురాముని కథ

పరీక్షిత్తు శుకునడిగెను
పరశురామ చరిత్రమును
మౌనివరుడు చెప్పదొడగె
మహిత పరశురాము కథను!

హైహయ వంశము నందున
అర్జునుడను రాజు గలడు
అతడు దత్తు గొలిచి పొందె
నమితమైన శక్తులెన్నొ!

బలము యశము సిరులు పొందె
బాహుసహస్రమ్ము పొందె
అణిమాదిగుణాలు పొందె
అరుల గెల్చు శక్తి పొందె!

ఒకనాడా అర్జునుండు
ఉవిదలతో గూడి రేవా
నదికి నేగె జలక మాడ
ముదము మీర నదిలో దిగె!

అతడు వేయి చేతులతో
నడ్డుకొనెను ప్రవాహమును!
ఆ సమయమ్మున దిగ్విజ
యమున వచ్చె రావణుండు!

అసురాధీశుని రావణు
నర్జునుండు జుట్టు పట్టి

మోకాళ్లను తలను నిలిపి
మోదెను పరాక్రమమ్మున!

దిగ్విజయము చేసినట్టి
దనుజేశుడు రావణుండు
అతని బాహుబలము ముందు
అణు మాత్రము నిలువ లేదు!

ఆ పై నత డొక్కనాడు
అడవి కేగె వేట కొరకు
అడవి లోన తిరిగి తిరిగి
అతడంతట నలసి పోయె!

అలసి పోయి యాతడు జమ
దగ్ని యాశ్రమమ్ము చేరె
రాజుకు జమదగ్ని అతిథి
పూజల నొనరించెనపుడు!

హోమధేను సాయమ్మున
ఆ ముని సేనకు రాజుకు
ఆతిథ్యం బిచ్చెనప్పు
డర్జునుడచ్చెరు వందగ!

అంతట నా అర్జునునకు
నావు పైన నాశ కలిగె
నావును తోలుకు రమ్మని
అనుచరులకు సూచించెను!

ఆ మనుజేశుని సేనలు
హోమధేనువును బలవం



తమ్ముగ గొంపోయిరపుడు
తబిసి మిగుల రోదించగ!

జమదగ్ని సుతుడు రాముడా
శ్రమమున లేకుండెనపుడు
అడవి నుండి వచ్చియతం
డా వృత్తాంతమ్ము వినెను!

ఔరా! అశనంబు గుడిచి
అర్జును డీరీతి జేసె
ననుచు ఆగ్రహంబందెను
చనియెనప్పుడు రాజు కడకు!

కుఠారమ్ము దాల్చి యటకు
హుటా హుటిగ వచ్చి నట్టి
పరాక్రమోపేతుడైన
పరశురాము రాజు గనెను!
అరుణారుణ నేత్రమ్ములు
శరచాపమ్ములు ధరించి
క్రోధరోషములను బుసలు
కొట్టుచు వచ్చెను రాముడు!

అల్పునిగ బాపడనుచు
అర్జును డెంచెను రాముని
తన సేనల పురి కొల్పెను
అనికి నంత రాము తోడ!

కుఠార రాముడు సేనల
కుళ్ళ బొడిచి చంపెనంత

రక్తపు టేరులు పారెను
రణ రంగము నందునపుడు!

అర్జునుండు క్రోధముతో
నాహవభూమికి వచ్చెను!
వచ్చి వేయిచేతులతో
వరుసగ బాణములు వేసె!

భార్గవ రాముండు కనలి
బాహు విక్రమము చూపుచు
ముక్కలు ముక్కలు చేసెను
నిక్కు, నర్జునుని విండ్లను!

అనుపమ కుఠార ధారల
నతని వేయి బాహువులను
నరికి పోగులను బెట్టెను
నగము భంగి నతడు నిల్వ!

పరసూదను డగు రాముడు
పరశువుతో నతని శిరము
ద్రుంచి చంపె నొక వేటున
దురిత చరితు రాజాధము!

ఆతని తనయులు వేవురు
అతని పైన దాడి చేయ
పారద్రోలి వారినెల్ల
పారుడు చనె గిడ్డి తోడ!

జమదగ్నికి నావు నిచ్చి
జరిగిన దంతయు చెప్పెను



రాజునట్లు హతుని జేయ
రాదని జమదగ్ని పలికె!

తాలిమి పారుల ధర్మము
తాల్మి మునుల మూల మగును
అనుచు పలికి, అపుడు తీర్థ
యాత్రల కంపెను తనయుని!

తాపసి జమదగ్ని యాజ్ఞ
తలపై దాలిచి రాముడు
తీర్థమ్ముల నెల్ల మునిగి
తిరిగి వచ్చె నాశ్రమముకు!

నాడు పరశురామునకును
నోడి పారిపోయినట్టి
కార్తవీర్య పుత్రులంత
కక్ష గట్టి యొక్క నాడు!

పరశురాము డాశ్రమమున
పరగ లేని సమయమ్మున
దాడి చేసి చంపిరి జమ
దగ్ని తలను గొంపోయిరి!

దీనముగా విలపించుచు
రేణుక జమదగ్ని పత్ని
వారి కడ్డు పడెను గాని
క్రూరులు పగ దీర్చు కొనిరి!

అంత రాము డడవి నుండి
ఆశ్రమమ్మునకు వచ్చెను

దురపిల్లుచు నామె పలికె
పరశురాముతో నీగతి!
అయ్యా! ముయ్యేడు మార్లు
ఆర్తనాదములు జేసితి
నయినా దయ జూప లేదు
అయ్యను పరిమార్చినారు!

అనుచు నామె దుఃఖించగ
ఆగ్రహమున రాము దూగి
పటపట మని పండ్లు కొరికి
పరశువు పూనెను రాముడు!

అర్జును పురమునకు నేగి
అందరిపై దాడి చేసి
ఖండించెను రిపుల తలలు
భండనమున రాముడంత!

అంతట తన పగ తీరక
నంతక రూపమ్ము దాల్చి
అవనీ తలమెల్ల వెతకి
ఇరువదొక్క మార్లు తిరిగి
పరశువుతో దాడి చేసి
ధరణీశుల నెల్ల జంపె!

పార్థివ రక్తంబులతో
పారుడంత ఏర్పరచెను
శమంతపంచకములుగను
ఆ మడుగుల శమియించెను
ఆతని క్రోధ సర్వస్వము



మహాయాగ మొకటి చేసి
మహి యెల్లన దాన మిచ్చి
ఇంద్రియముల గెలిచియును మ
హేంద్ర పర్వతమును జేరె!

భృగుకులమున బుట్టిన హరి
జగతీ భారమ్ము బాపె
ఇది పరశురాము చరితము
సదమల భాగవత సుధ!

* * *

# పృథుచక్రవర్తి కథ

అనఘా! దయతోడ నాకు
వినిపింపుము పృథుని కథను
అని యడిగిన పరీక్షితున
కనియె నిట్లు శుకమహర్షి!

క్ష్మానాథా! భువి నొకప్డు
క్షామం బేర్పడెను, దాన
జనులాకలి పీడితులై
జననాథుని వేడుకొనిరి!

ప్రజల మొరలు విన్న పృథువు
పటుతరపరాక్రమమ్మున
శరచాపమ్ములు ధరించి
ధరణిని దండింప నేగె!

త్రిపురమ్ములు దహియింపగ
త్రినేత్రు చందమున వచ్చు
ధరణీశుడు పృథువును గని
ధరణి పూనె గోరూపము!

తన వెంట పడిన ధరణీ
శుని గని పలికెను ధేనువు
రాజా! ఈ రీతి నన్ను
రాయిడి పెట్టగ తగునా!

యని పలుకగ గోవంతట
యనియె రాజు ధేనువునకు
నీ వీ గతి వగవ నేల!
నేరవు నా ప్రతాపమును!





ప్రజలందరు క్షామముతో
పలువిధముల దుఃఖింతురు
పంటలు పండక వారల
కంట నెత్తురొలుకు చుండె!

మందమతివి జనుల నిట్టు
లందర వంచించినావు!
వధియింతును నిన్నిప్డు
వసుధా! యని పలికె పృథువు!

ధారణి గడగడ వడకుచు
ధారణి పతి కంజలించి
అనఘా! నీ శరణు జొత్తు
నని పలికిన దవని యంత!

ఆదివరాహంబగుచును
అక్కటికమ్మున బ్రోచితి
వట్టి నీవు నను వధింప
నగునే ధర్మమ్ము నీకు!

అవనిపతీ! మఖ కర్మలు
అసలును లేవెచట జాడ!
అవనిప! బీజౌషధమ్ము
లయ్యెను నాలో జీర్ణము!

దూడ నొకటి కల్పింపుము
దుగ్ధముల నిత్తునేడ!
అని ధేనువు పలికినంత
అవనీశుం డటుల చేసె!

మనువును దూడగ చేసెను
మరి, దోహన తానొనర్చె

వృథ్వియంత క్షీర మిచ్చె
పృథువత్సల యయి పృథువుకు!

సుర యక్షోరగ కిన్నర
ధరణి పతులు చరాచర
ప్రపంచ మంతయు పొందెను
పరమౌషధ బీజమ్ముల!

పృథు వీరీతిగ నంతట
పితయయ్యెను లోకములకు
పృథ్వి యన్న పేరు వడసె
పుడమి యంతయును చూడగ!

జనుల క్షామమది తీరెను
జగములు సంతోషించెను
ఆ పృథివీపతియు పృథువు
అశ్వమేధ మొకటి చేసె!

యాగాశ్వము నపహరించె
నమరేంద్రుండగు నింద్రుడు
ఇంద్రుగెలిచి అశ్వంబును
ఇలాపతియు గొని వచ్చెను!

అచట నున్న ఋషి పుంగవు
లతని పరాక్రమము పొగడి!
ఆశ్చర్యంబున 'జితాశ్వ'
దని పేరిడి రా పృథువుకు!

ఆ గతి పృథుచక్రవర్తి
హయమేధమ్ముల చేసెను
తొంబది తొమ్మిది యప్పుడు
జంభారియు వణకి పోయె!



తన పదవికి ముప్పు వచ్చు
నని శతమఖు డదరి పడెను
రాజీవాక్షుండగు హరి
రాజీ కుదిర్చె వారికి!

అబ్జ నేత్రు డనియె నప్పు
డవనీశా! ధర్మమ్ముగ
నవని జనుల పాలింపుమ
అనుపమ మఖముల జేయుమ!

హరిభక్తుండయిన పృథువు
హరి యాజ్ఞను తలదాల్చెను!
ఆ పయి నతడేలుచుండె
నవనిజనుల ప్రేమ మీర!

అంతట సనకసనందులం
దరువచ్చి రతని కడకు
వారల కడు భక్తి తోడ
ధారణి పతి పూజించెను!

పరమ కరుణ తోడ వారు
బ్రహ్మతత్త్వమును జెప్పిరి!
అతడు జ్ఞాన వైరాగ్యము
లబ్బగ ముక్తుండయ్యెను!

అతడు విష్ణు భక్తులలో
నగ్రగణ్యుడై వరలెను!
ఇది పృథుచరితము సకలము
సదమల భాగవత సుధ!

* * *

# సుభద్రా కళ్యాణము

ధీవిశాల! శుకముని వర!
తెలియ జేయు మయ్య నాకు
సుభద్రార్జునుల పరిణయ
సుచరిత్రము నిపుదు దయను!

అని పరీక్షితుండడుగగ
వ్యాస తనయుడైన శుకుడు
సుభద్రార్జునుల పరిణయ
సుమధుర కథ నిట్లు తెలిపె!

దేవేంద్రుని సుతుడు నరుడు
తీర్థయాత్ర లొనరించుచు
ప్రభాసతీర్థమ్ము జేరె
ప్రమోదమున తానంతట!

సుభద్రనుం బలభద్రుడు
సుయోధనున కిచ్చునన్న
వార్త నెరిగి పార్థుడపుడు
ద్వారక కేగగ నెంచెను!

త్రిదండి వేషమ్ము పూని
యతండు ద్వారకకు జేరె
చూడనెంచె సవ్యసాచి
సుభద్ర నుత్సాహమ్ముగ!

ద్వారకలో జనులెల్లరు
వారక పూజించిరతని
తన కోరిక తీరు వరకు
ద్వారకలో నుండెనతడు!



ఈ లోగా వర్షర్తువు
ఏ తెంచెను అపుడు కనగ
చాతుర్మాస్య మొనర్చెను
చతురతతో నరుడచ్చట!

నరుని కపటవేషమ్మును
ఎరుగ నట్టి బలరాముడు
ఆతని గొని తెచ్చి యుంచె
నాత్మ మందిరమ్ము నందు!

ప్రతినిత్యము భిక్ష పెట్టి
యతిని గొలుచు చుండె నతడు
కపటమౌని యర్జునుండు
కనుచు నుండె సమయమునకు!

తెలియును కృష్ణుని కంతయు
తెలిసి కూడ మిన్న కుండె
అనుంగు సోదరి సుభద్ర
నర్జునున కీయ దలంచి!

సుభద్ర యావనము నందు
సురుచిర రూపమ్ము తోడ
సంచరించు చుండెనంత
పంచబాణు బాణమ్మున!

ఆమె అందచందమ్ములు
ఆత్మకెంతొ విందు చేయ
బలారి సుతుండు నిలిపెను
భామను తన హృదయమ్మున!

ఆ తరుణీ శిరోమణియు
నాతని మనమందు నిలిపె!
యతిరూపమ్మున నున్నది
అర్జునుడే యని యెరింగె!

ఇట్లుండగ నొక్క నాడు
ఆ సుభద్ర పురము వీడి
దేవతోత్సవమ్మునకై
దేవాలయమున కేగెను!

వెన్నెల వలె కన్నులకును
విందొనర్చె నా సుభద్ర!
మించు దేహకాంతులతో
మెరుపు తీగ వలె సుభద్ర!
పులకింతలు కలిగించెను
పుత్తడి బొమ్మ సుభద్రను!
గాంచి యర్జునుండంతట
కపటరూపమను వీడెను!

దేవకివసుదేవు లంత
దీవన లిడ యర్జునుండు
తగిన సమయ మిదేయనుచు
తరుణిని తోడ్కొని పోయెను!

అరదము పైన సుభద్ర ను
అర్జునుండు గొంపోవగ
యదు సేనలు వెంటాడెను
అర్జును నమిత పరాక్రము



సవ్యసాచి వారి పైన
శరవర్షము కురిపించెను
గాండీవము చేత బూని
కవ్వడి యుద్ధమొనర్చెను!

ఆఖండలనందనుండు
అఖండ పరాక్రమమ్మున
యదు సైన్యమ్మును చెల్లా
చెదరుగ చేసెను, అంతట!

బలరాముడు వార్త తెలిసి
భగ్గు మనుచు మండి పడెను!
మిక్కిలి క్రోధమున నరుని
ఉక్కడగించగ నెంచెను!

సమయోచితముగ గృష్ణుడు
సరసమధురవాక్కులతో
నన్న గారి క్రోధమ్మును
అనునయించి తగ్గించెను!

శాంతుడైన బలభద్రుం
డంతట సుభద్ర కొసగెను
కరులు హరులు భూషణమ్ము
లరణమ్ముగ ప్రేమ తోడ!

ఈగతి కృష్ణుండప్పుడు
ఈడేర్చెను వారి కోర్కె
ఇది సుభద్ర పరిణయ కథ
సదమల భాగవత సుధ!

* * *

# పరీక్షిత్తు కథ

ఉత్తరాభిమన్యులకును
నుద్వాహం బైన యంత
నుత్తర గర్భము దాల్చిన
దత్తరి కాలమ్ము గడచె!

ఉత్తరగర్భము నందున
నుండెను పిండం బొక్కటి
దానిపైన వేసె నశ్వ
త్థామ బ్రహ్మ శిరోస్త్రమ్ము!

మహాజ్వాల లుమియుచు నా
మహాస్త్రమ్ము ఉత్తర పై
దాడి చేయ గర్భము నం
దలి పిండము తల్ల డిల్లె!

గర్భము నందలి పిండము
కడు దీనముగా నుతించె
తన రక్షణ సేయు నట్టి
ధర్మాత్ముని వేడు కొనుచు!

గదాధరుండగు విష్ణువు
గతాగత ప్రాణుండగు
భ్రూణమ్మును కాపాడెను
ప్రాణమ్ములు పోకుండగ!

పిండము చుట్టును గదా
దండమ్మును గుండ్రమ్ముగ





త్రిప్పుచు హరి పిండమునకు
త్రిప్పట తొలగించెనపుడు!

ఉత్తరకును పుట్టెనంత
నుజ్వలమగు మగబిడ్డడు
ధర్మరాజు శిశువు జాత
కర్మంబులు చేయించెను!

విష్ణువు రక్షించె గాన
విష్ణురాతుడని పేరెడె!
ఆపదలో నున్న తనను
కాపాడెడు వారి కొరకు
పరీక్షగా చూచె గాన
పరీక్షిత్తు పేరు కలిగె!

ధర్మశాస్త్రములు చదివెను
ధనుర్విద్య నేర్చెనంత
రాజోచిత ధర్మ మందు
రాజిల్లెను పరీక్షిత్తు!

అభిమన్యుని తనయునకును
అప్పగించి రాజ్యమ్మును
ధర్మసుతుండపుడు మహా
ప్రస్థానమ్మున కేగెను!

పరీక్షిత్తు ధర్మమ్ముగ
ధరాతలము నేలుచుండె
శ్రీహరిపదభక్తుండై
చేయు చుండె పాలనమ్ము!

మాతులసుత ఇరావతిని
యాతడు వివాహ మాడెను
జనమేజయుండు నలుగురు
జనియించిరి సుతులతనికి!

ఆతడు కలి నరికట్టుచు
భూతలమ్ము నేలు చుండె
హయమేధమ్ములు మూడిటి
నత డొనర్చె మోదమ్ముగ!

వేదండ పురాధిపుండు
వేటకేగె నొక్క నాడు
పలు మృగముల వేటాడెను
పరీక్షిత్తు వేట యందు!

అతడు వేట తమకముతో
ఆకలితో దప్పికతో
అడవిలోన కడు దూరం
బరిగెను తనసేన వీడి!

చని చని యాతండు తపో
వనము నందు జొచ్చె వేగ
నది శమీకు నాశ్రమమ్ము
అతడుండెను తపస్సులో!

సమాధి నిష్ఠుండగు నా
శమీకు నడిగెను నీరము
లు నతడు తపస్సులో
ఉలక లేదు పలక లేదు!



పరీక్షత్తు మిగుల క్రోధ
పరవశుడై వెతకి వెతకి
మృతసర్పము నొకటి దెచ్చి
మెడను వేసె శమీకునకు!

ఆ రీతిగ చేసి యతడు
చేరెను తన పురమ్మునకు
అంతలోన వచ్చె శృంగి
యనుగు సుతుడు శమీకునకు!

తనయుండగు శృంగి చూచె
తండ్రిగారి మెడను వ్రేలు
మృతసర్పము నంత నతడు
మిగుల క్రోధమును బొందెను!

జలముల చేగొని యాతడు
శపియించెను పరీక్షితుని
తక్షకసర్పము కాటుకు
తప్పక మరణించు ననుచు!

ఏగతి కర్మఫలంబులు
నెవరి తరము తప్పింపగ!
ముని కుమారు డిడిన శాప
మును గురించి రాజెరింగె!

పామును ముని మెడను వేసి
పాపమేల చేసినాను!
అని పశ్చాత్తాపమ్మున
అవనీశుడు దుఃఖించెను!

భాగవత కథా సుధ 75

దామోదరపదభక్తిని
కామక్రోధముల గెల్చిన
కతమున శాంతుం డగుచును
ప్రతిశాపం బీయకుండె!

చిత్తము గోవింద పదా
యత్తము గావించి యపుడు
గోవిందుని కథలు వినగ
కోర్కె గలిగె పరీక్షితుకు!

అచటి కప్పు దరుదెంచెను
సుచరితుండు శుకమహర్షి
ప్రతినిమేషము గూడ పర
బ్రహ్మమున చరించువాడు!

పుడమి రేడు పరీక్షిత్తు
తడయక ప్రార్థించె నతని
దురితమ్ములు తొలగించెడు
హరిచరితము తెలుపుమనుచు!

భక్తి తోడ పరీక్షిత్తు
ముక్తి కోరి హరిచరితము
వినుచునుండ మోదమ్మున
వినిపించెను శుక మహర్షి!

శ్రీకైవల్య పదంబులు
శ్రీ రమణుని మధుర కథలు!
పరీక్షిత్తు గ్రోలెనిట్లు
భాగవత కథా సుధలు!

* * *